# పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం

## కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్ యాప్

- ఆధునీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం
- ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు
- 10 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ
- 100 నిమిషాల్లో ఫిర్యాదుదారుడికి సమాచారం

మెదక్‌రూరల్, అక్టోబర్ 19: ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ప్రస్తుతం ఈ యాప్ ఆధునీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేసింది. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసిన ఫిర్యాదు దారుడికి సమాచారం తెలియజేస్తారు. ఈ సమాచారం జిల్లా ఎన్నికల అధికారితోపాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది. ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘించినా, వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతుల వంటివి ఇచ్చి ప్రలోభాలకు గురిచేసినా ఈ వివరాలను నేరుగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎన్నికల ప్రచారంలో అనుమతులు లేకుండా లైడ్ స్పీకర్ వాడటం ఇతర నిబంధనలు ఉల్లంఘించినా, కులమతాలను రెచ్చగొట్టె వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినాన ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.



కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గోడపత్రిక






స్మార్ట్‌ఫోన్‌లో సీ-విజిల్ యాప్

### యాప్‌తో నేరుగా ఫిర్యాదు

స్మార్ట్ ఫోన్లలో సీవిజిల్ యాప్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి కోడ్ ఉల్లంఘనపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. స్మార్ట్‌ఫోన్లలో సీవిజల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బాషను ఎంపిక చేసుకుని టీక్ చేయమని సూచిస్తుంది. అనంతరం ఈ యాప్ మీ స్మార్ట్ ఫోన్లలో స్క్రీన్‌పై కనిపిస్తుంది . ఆ తర్వాత సెల్‌ఫోన్ నంబర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ అఫ్ ఇండియా నుంచి ఎస్‌ఎంఎస్ ద్వారా 4 అంకెలతో కూడిన నెంబర్ వస్తుంది. ఈ నెంబర్ సెల్‌ఫోన్‌లో ఎంటర్ చేసిన అనంతరం వినియోగదారుడికి సంబంధించిన పూర్తి వివరాలు వస్తాయి. అనంతరం మీ ఫోన్‌లో యాప్ ఓపెన్ అవుతుంది. మీ పరిధిలోని కోడ్ ఉల్లంఘనపై ఫొటో లేదా వీడియోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఫిర్యాదు అందిన 10నిమిషాల్లో ఎన్నికల అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటారు. ఈ యాప్ గురించి ఇతర వివరాలకు 1950కి కాల్ చేయవచ్చు

### అక్రమాలకు అడ్డుకట్టగా సీ-విజిల్ యాప్




ఎన్నికల నియమ నిబంధనలను రాజకీయ పార్టీలు ఉల్లంఘిస్తే సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయం ఎన్నికల అధికారులకు సమాచారం అందిస్తారు. పది నిమిషాల్లో ఘటనాస్థలానికి చేరుకునే విధంగా మండలస్థాయి ఫ్లయింగ్ అధికారులకు సమాచారం అందజేస్తారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటారు. ఈ సీవిజిల్ యాప్ గురించి గ్రామాల్లో గోడ పత్రికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాం.

*- శ్రీనివాస్, మెదక్ తహశీల్దార్ (ఎంఆర్‌వో)*

# దుబ్బాక ఎమ్మెల్యేకు చుక్కెదురు

## బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌ను నిలదీసిన ప్రజలు

- అర్ధంతరంగా ఎన్నికల ప్రచారం ముగింపు
- గత ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై మహిళల ప్రశ్నల వర్షం
- గ్రామాల్లో తప్పని నిలదీతలు
- వీరానగర్, రాంసాగర్ ఆగ్రహించిన గ్రామ మహిళలు


దుబ్బాక నియోజకవర్గం రాయపోల్ మండలం వీరానగర్‌లో బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రఘునందన్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

దుబ్బాక, అక్టోబర్ 19 : తాను తీసుకున్న గొయ్యిలో తానే పడ్డట్టు ఉంది దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ పరిస్థితి. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో ఆయన ప్రజలకు అలవికాని హామీలు ఇచ్చాడు. ఆ తర్వాత వాటిని విస్మరించాడు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ఊరికి వెళ్లినా ఆయనకు చుక్కెదురు తప్పడం లేదు. రఘునందన్‌రావు వారం రోజులుగా ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యేగా మూడేండ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో పాటు ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆయనను నిలదీస్తున్నారు. గురువారం దుబ్బాక నియోజకవర్గంలోని రాయపోల్ మండలంలో వీరానగర్, రాంసాగర్ గ్రామాల్లో రఘునందన్ ప్రచారం నిర్వహించారు. ఆ గ్రామాల ప్రజలు, మహిళలు ఆయనను అడ్డుకున్నారు. వీరానగర్‌లో గ్రామస్తులు చుక్కలు చూపెట్టారు. గత ఉప ఎన్నికల హామీలు ఏమయ్యాయి..? మళ్లీ మా గ్రామానికి ఎందుకొచ్చావంటూ ఆ గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. నిరుద్యోగ యువతకు భృతి, రైతులకు జోడేడ్ల నాగలి, నిరుపేద వధువు వివాహానికి ఆర్థిక సహాయం, కేంద్ర ప్రభుత్వం నుంచి దుబ్బాకలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తానంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. ప్రత్యేక నిధులు తెచ్చి తమ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని, మోసగించావంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో బీజేపీ ప్రచారం నిర్వహించవద్దని గ్రామస్తులు అడ్డుకున్నారు. చేసేదేమిలేక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రచారాన్ని అర్ధంతరంగా ముగించుకుని వెళ్లిపోయారు. అనంతరం రాంసాగర్ గ్రామానికి ఆయన వెళ్లగా ఇదే పరిస్థితి ఎదురైంది. ఓట్ల కోసం తప్పా బీజేపీ నాయకులకు అభివృద్ధి సోయి లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఎమ్మెల్యే చేసిన ఒక్క అభివృద్ధి పనైనా ఉందా అని ప్రశ్నించారు. పది రోజుల కిందట దుబ్బాక నియోజకవర్గంలో రఘునందన్‌రావు చీరలు, గొడుగులు పంపిణీ చేశారు. ఈ విషయంపై రాంసాగర్‌కు చెందిన మహిళలు ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డారు. గ్రామాల్లో బీజేపీ నాయకులు చీరలు పంచి తమ ఇండ్లలో గొడవలకు దారి తీశారంటూ కొందరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చీరలు పంచాల్సిన అవసరం ఏముంది అంటూ నిలదీశారు. మీ చీరలకు ఆశపడి బీజేపీకి ఓట్ల వేయ్యాలా అని మరికొందరు మహిళలు ప్రశ్నించారు. ఎమ్మెల్యే వారికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ గ్రామంలో సైతం ప్రచారం అర్ధంతరంగా ముగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండు రోజుల కిందట ఇందుప్రియాల్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులను బస్ సౌకర్యం కోసం ఆ గ్రామ బీజేపీ నాయకులు ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లారు. కనీసం ఓటు హక్కు కూడా లేని విద్యార్థులకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించడంతో విద్యార్థులు బేలముఖం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఏ గ్రామానికి వెళ్లినా నిలదీతలు ఎదురవుతుండడంతో రఘునందన్‌రావు అసహనానికి గురవుతున్నట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేకత పెరగడంతో అయోమయానికి గురవుతున్నట్లు తెలిసింది.

# కాంగ్రెస్, బీజేపీలో రెబెల్స్ గుబులు

## టికెట్ దక్కని ఆశావహులు రెబెల్స్‌గా పోటీకి సన్నద్ధం

- బుజ్జగింపులు, పదవులను ఎరవేసే పనిలో ఇరుపార్టీల అధిష్టానం
- రెండు పార్టీల్లోనూ ప్రాధాన్యం దక్కని నేతలు కోవర్టులుగా మారే అవకాశం
- అభ్యర్థులను ప్రకటించి బీఫామ్‌లు అందజేసిన బీఆర్‌ఎస్
- ప్రచారంలోనూ దూసుకుపోతున్న బీఆర్‌ఎస్ నేతలు
- ఇప్పటివరకు ఇంకా పూర్తిగా అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ





సంగారెడ్డి అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీలు ఇంకా పూర్తిగా అభ్యర్థులను ప్రకటించ లేదు. అభ్యర్థుల ప్రకటనకు ముందే రెండు పార్టీల్లో రెబెల్స్ భయం వెన్నాడుతున్నది. ఎమ్మెల్యే టికెట్ ఆశించి దక్కని నేతలు రెబెల్స్‌గా బరిలో దిగుతారన్న అనుమానాలు కాంగ్రెస్, బీజేపీ పెద్దల్లో నెలకొంది. టికెట్ రాని ఆశావహులు, పార్టీలో ప్రాధాన్యం దక్కని నేతలు కోవర్టులుగా మారి పార్టీకి నష్టం చేకూరుస్తారన్న భయం రెండు పార్టీల్లోనూ కనిపిస్తోంది. బీఆర్ ఎస్ సంగారెడ్డి జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడంతోపాటు బీఫామ్‌లను అందజేసింది. ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మాత్రం ఇప్పటివరకు అభ్యర్థులను పూర్తిస్థాయిలో ప్రకటించ లేదు. కాంగ్రెస్ పార్టీ తొలిజాబితాలో మూడు అసెంబ్లీ స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రకటించింది. కాంగ్రెస్ తొలి జాబితాలో టికెట్ ఆశించిన నేతలు పార్టీ తమకు టికెట్ ఇవ్వకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. టికెట్ రాని కొంతమంది ఇండిపెండెంట్‌గా అభ్యర్థులుగా పోటీ చేసే యోచనలో ఉన్నారు. బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించం లేదు. రెండురోజుల్లో బీజేపీ అధిష్టానం తొలిజాబితాను ప్రకటించే అవకాశం ఉంది. బీజేపీ టికెట్ ఆశిస్తున్న నేతలు తొలి, మలి జాబితాలో తమ పేర్లు లేనిపక్షంలో స్వతంత్రంగా బరిలో దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో రెబెల్స్ గుబులు వెన్నాడుతున్నది.

### కాంగ్రెస్‌లో రెబెల్స్ గుబులు

సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వరుస ఓటములను చవిచూసింది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి చావోరేవోలా మారాయి. బలమైన అభ్యర్థులు బరిలోకి దింపాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తున్నా పరిస్థితులు అనుకూలించడం లేదు. కాంగ్రెస్ అధిష్టానం అనుసరిస్తున్న తీరులో మార్పు రావటం లేదన్న అసంతృప్తి సొంత పార్టీ నేతల్లో కనిపిస్తున్నది. కాంగ్రెస్ తొలిజాబితాలో దామోదర్(అందోలు), జగ్గారెడ్డి(సంగారెడ్డి), చంద్రశేఖర్(జహీరాబాద్) ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. నారాయణఖేడ్, పటాన్‌చెరు ఇంకా ప్రకటించాల్సి ఉంది. అందోలు నుంచి టికెట్ కేటాయించిన దామోదర్ రాజనర్సింహపై స్థానిక నేతల్లో అసంతృప్తి కనిపిస్తోంది. దామోదర్ ప్రజాబలం లేక వరుస ఓటమిపాలవుతున్నా అధిష్టానం స్థానిక నేతలను పక్కనబెట్టి ఆయనకే టికెట్ కట్టబెట్టడంపై అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. ఇక్కడ టికెట్ ఆశించిన కాంగ్రెస్ నేతలు అధిష్టానం నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండిపెండెంట్‌గా బరిలో దిగే అవకాశాలు ఉన్నాయి. సంగారెడ్డిలో మరోమారు జగ్గారెడ్డికి టికెట్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన శంకర్‌రెడ్డి, సంగమేశ్వర్ టికెట్ ఆశించారు. ఇద్దరికి టికెట్ రాకపోవడంతో వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఎన్నికల్లో పనిచేయకపోవచ్చన ప్రచారం కాంగ్రెస్ పార్టీ నేతల్లో సాగుతుంది. ఇదిలాఉంటే కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించిన స్థానికేతరుడైన మైనార్టీ నేత ముకీమ్ ఇండిపెండెంట్‌గా పోటీచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంతో సంబంధంలేని, స్థానికంగా నివాసం ఉండని చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి ఉంది. టికెట్ దక్కని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ బహిరంగానే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. టికెట్ ఆశించిన భంగపడ్డ కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, గోపాల్ స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగటంపై సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే టికెట్ కోసం సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డి ఎవరికివారే గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇద్దరిలో ఎవరికి టికెట్ దక్కినా మరొకరు ఇండిపెండెంట్‌గా లేదా ఇతర పార్టీ గుర్తుపై పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కోసం గాలి అనిల్‌కుమార్, కాటా శ్రీనివాస్‌గౌడ్ పోటీ పడుతున్నారు. ఇక్కడా ఎవరికి టికెట్ దక్కకపోయినా మరొకరు బరిలో దిగేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇలా కాంగ్రెస్ పార్టీకి రెబెల్స్ గుబులు వెన్నాడుతున్నది. దీనికితోడు పార్టీలో ప్రాధాన్యం దక్కని ద్వితీయ శ్రేణి నాయకులు అసంతృప్తితో పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తే ఎలా అన్న భయం కాంగ్రెస్‌లో ఉన్నది.

### బీజేపీలోనూ వెన్నాడుతున్న రెబెల్స్ భయం

బీజేపీ తొలి జాబితాను రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. సంగారెడ్డి జిల్లాలోని అందోలు మినహా మిగతా అభ్యర్థులను తొలిజాబితాలో ప్రకటించే అవకాశం కనిపించటం లేదు. ఒక వేళ ఐదుస్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా పార్టీకి రెబెల్స్ భయం పట్టుకుంది. సంగారెడ్డి అసెంబ్లీలో దేశ్‌పాండే, పులిమామిడిరాజు, శివరాజ్‌పాటిల్ ప్రధానంగా ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీపడుతున్నారు. వీరిలో ఎవరికి టికెట్ దక్కినా మిగతా ఇద్దరు రెబెల్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. పటాన్‌చెరులో నందీశ్వర్ గౌడ్, అంజిరెడ్డి, శ్రీకాంత్ గౌడ్ టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ ఎవరికి టికెట్ వచ్చినా మిగితా ఇద్దరు సహకరించే పరిస్థితి లేదు. అందోలులో బాబూమోహన్‌కు టికెట్ ప్రకటిస్తే ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న బాలయ్య రెబెల్‌గా బరిలో దిగటం లేదా పార్టీ మారే అవకాశాలు ఉన్నాయి. నారాయణఖేడ్‌లో విజయ్‌పాల్‌రెడ్డి, సంగప్ప, సంగ్రాం మహారాజ్ ఎవరికివారే టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి టికెట్ దక్కినా మిగతా ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థికి సహకరించే అవకాశాలు లేవు.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



సిద్దిపేట కలెక్టరేట్ బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న కలెక్టర్ పీజే పాటిల్, ఉద్యోగినులు

- సిద్దిపేట కలెక్టరేట్‌లో అట్టహాసంగా బతుకమ్మ సంబురాలు
- పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దంపతులు, మహిళా ఉద్యోగులు


బతుకమ్మతో సీపీ శ్వేత

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 19: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ నేతృత్వంలో అధికారికంగా బతుకమ్మ సంబురాలు జరిపారు. ఈ ఉత్సవాల్లో మహిళా ఉద్యోగులు పాల్గొని బతుకమ్మ పేర్చి పాటలు పాడారు. ముందుగా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దంపతులు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు గౌరీమాతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రభుత్వం వైభవంగా నిర్వహిస్తున్నటట్లు చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. ప్రకృతికి ప్రతిరూపం దుర్గామాత అని, దేవున్ని పూజించడం మూలంగా మనసులో ప్రశాంతత ఉంటుందని తెలిపారు. ప్రజలందరూ బతుకమ్మ, దసరా పండుగలు సంతోషంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు చెప్పారు. సీపీ శ్వేత మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉద్యోగ బాధ్యతలతో బిజీగా ఉండే మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబురాలతో వారి ముఖాల్లో సంతోషం కనబడుతున్నదన్నారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. బతుకమ్మ సంబురాలతో కలెక్టరేట్‌కు కొత్తశోభ తెచ్చిందన్నారు. కలెక్టర్ కూతురు పద్మజ పాడిన బతుకమ్మ పాట, చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఉత్సవాల్లో డీఆర్‌వో నాగరాజమ్మ, డీపీవో దేవకీదేవి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సరోజ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు, టీఎన్‌జీవో నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.


బతుకమ్మతో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్